క్లుప్తంగా

ఘనంగా నృసింహ జయంతి



జుఝువరం(పామర్రు): మండలంలోని జుఝువరంలో స్వయంభుగా వెలసిన శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నృసింహ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ఆలయంలో స్వామికి ప్రత్యేకంగా అభిషేకాలను చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు రొంపిచర్ల సాయి, ఆర్ ధనవెంకట సత్యనారాయణ, ఆర్ అరవిందకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

పెండ్లికుమారుడిగా వేణుగోపాలస్వామి



పామర్రు: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి(విష్ణాలయం) ఆలయంలో వైశాఖ మాసం శుద్ధ త్రయోదశి మంగళవారం పురస్కరించుకుని స్వామివారిని పెండ్లి కుమారుడిగా అలంకరించారు. తొలుత ఆలయంలో మూల విరాట్ స్వాములకు పంచామృతాలతో, నవరసాలతో, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పెండ్లి కుమారుడిగా అలంకరించి, అర్చకులు రొంపిచర్ల ప్రసాద్, గోపి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి, సిబ్బంది కె.ప్రభాకర్‌రెడ్డి, భక్తులు రామకృష్ణారెడ్డి, చెంచయ్య, నిఖిల్‌గాంధీ పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



పెదపారుపూడి: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతిఒక్కరూ నియమావళి తప్పకుండా పాటించాలని ఎస్‌ఐ రాజ అన్నారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో మంగళవారం ఆయన ఎన్నికల నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ సమీపిస్తుండటంతో ఎవరూ సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదన్నారు. బాణసంచా పేల్చడానికి అనుమతులు లేవన్నారు.

గౌడ సంఘ నేతల పరామర్శ



కైకలూరు: మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు ఇటీవల గుండెపోటుకు గురై విజయవాడ రమేష్ ఆస్పత్రిలో వైద్య సేవలు పొంది మచిలీపట్నం తిరిగివచ్చారు. కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘం ఆధ్వర్యంలో మచిలీపట్నంలో ఆయన ఇంటికి మంగళవారం వెళ్లి పరామర్శించారు. రాష్ట్ర గౌడ సంఘ వైస్ చైర్మన్ పోసిన చెంచు రామారావు, బొర్రా చలమయ్య, కైకలూరు నియోజకవర్గం గౌడ సంఘ అధ్యక్షులు పోలగాని నాగరాజు, మండవల్లి, ముదినేపల్లి, కైకలూరు, కలిదిండి మండలాల సంఘ అధ్యక్షులు, గౌడ సంఘ నాయకులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

వెంట్రప్రగడ (పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ ఎర్ర చెరువు సమీపంలో ఉన్న నరసింహస్వామి వార్షిక కల్యాణం సందర్భంగా మంగళవారం అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాతల సహకారంతో సుమారు మూడు వేల మందికి అన్నసమారాధన చేశారు.

విద్యార్థుల మెదడుకు పదును

పామర్రు: చెస్ తదితర ఆటలను ఆడటం వలన విద్యార్థుల మెదడుకు పదునుతోపాటు జ్ఞాపకశక్తి పెంపొందుతుందని పామర్రు ద్వితీయ శ్రేణి గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి పేర్కొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చెస్, క్యారమ్స్ తదితరాలు ఆడటం వలన వారిలో ఉన్న ఐక్యూ పెంపొందుతుందన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలు వచ్చే నెల 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 11.30 నిముషాల వరకు జరుగుతాయని పేర్కొన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మండవల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విదార్థులతో మంగళవారం పుస్తక పఠనం, పుస్తక సమీక్షలను గ్రంథాలయాధికారి షేక్ పర్వీన చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కథలు చదవడం, డిక్టేషన్ కాంపిటీషన్ నిర్వహించారు. షేక్ పర్వీన మాట్లాడుతూ చెస్, క్విజ్, జనరల్ నాలెడ్జ్, స్పోకెన్ ఇంగ్లిష్ వంటి అంశాలు నేర్పిస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు నీతి కథలు

ముదినేపల్లి రూరల్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు మంగళవారం నీతి కథలు బోధించారు. లైబ్రేరియన్ ఎం.శ్రీదేవి పలు పుస్తకాలలో ప్రచురితమైన నీతి కథలను అర్థవంతంగా విద్యార్థులను ఆకట్టుకునేలా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణితం సబ్జెక్టుకు సంబంధించి పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. క్యారమ్స్, చెస్, వైకుంఠపాళి ఆటలు ఆడించి బహుమతులను విజేతలకు అందజేశారు.



ముదినేపల్లి శాఖాగ్రంథాలయంలో నీతికథలు చెబుతున్న లైబ్రేరియన్



పామర్రు గ్రేడ్-2 గ్రంథాలయంలో చెస్ ఆడుతున్న విద్యార్థులు



మండవల్లి గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

పోలీసులు అప్రమత్తం

గుడివాడరూరల్: రాష్ట్రంలో పోలింగ్ అనంతరం జరుగుతున్న హింసాత్మక సంఘటనపై గుడివాడ పోలీసులు అప్రమత్తమయ్యారు. వన్, టూటౌన్ సీఐలు కె.ఇంద్ర శ్రీనివాస్, ఎంవీ దుర్గారావు ఆధ్వర్యంలో గుడ్‌మన్‌పేట, వాంబే కాలనీల్లో తమ సిబ్బందితో పోలీసులు మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించి, రెండు ప్రాంతాల్లోని ఇళ్లను సోదాలు చేశారు. ఆయా ప్రాంతాల్లో నివాసముంటున్న వారిని పరిశీలించి కొత్త వారు ఎవరైనా వచ్చారా అనే వివరాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐలు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని, అదేవిధంగా కౌంటింగ్ సమయంలో ఎటువంటి గొడవలు తలెత్తకుండా ముందస్తుగానే పోలీసుశాఖ అన్ని చర్యలు చేపడుతుందన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే వెంటనే ఆయా ప్రాంతాల్లోని ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ఈ కార్డన్ సెర్చ్‌లో బాగంగా సరైన ధ్రువ పత్రాలు లేని ఐదు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో వన్, టూటౌన్ ఎస్‌ఐలు గౌతమ్‌కుమార్, నాగరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



గుడ్‌మన్‌పేటలో ప్రజలతో మాట్లాడుతున్న వన్, టూటౌన్ సీఐలు కె.ఇంద్రశ్రీనివాస్, ఎంవీ దుర్గారావు

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

గుడివాడరూరల్: గుడివాడ మండలంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎస్.లక్ష్మీనరసింహమూర్తి హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయని, అదేవిధంగా కౌంటింగ్ పూర్తయ్యే వరకు ఉద్దేశపూర్వకంగాని, సోషల్‌మీడియా ద్వారాగాని రెచ్చగొట్టే విమర్శలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలకు విఘాతం వాటిల్లకుండా పోలీస్‌శాఖ అన్ని చర్యలు చేపడుతోందన్నారు. ఎన్నికల కోడ్‌తో పాటు మండలంలో 144సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. ముగ్గురికి మించి ఎక్కువ మంది గుమికూడి ఉండరాదన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, ప్రత్యర్థులు ఇళ్ల వద్ద, కార్యాలయాల వద్ద బాణసంచా కాల్చరాదన్నారు. సివిల్ తగాదాలు ఆసరాగా తీసుకుని ఒకరిపై మరొకరు గొడవలకు దిగితే ఇరువురిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే మండలంలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలను గుర్తించామని, కౌంటింగ్ రోజు పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. రాజకీయ నాయకులతో పాటు ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఎస్‌ఐ కోరారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ మూర్తి

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు

మొవ్వ: ఈ నెల 24వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల కోసం స్థానిక క్షేత్రయ్య జూనియర్ కళాశాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ కేవీఎస్‌వీ ప్రసాద శాస్త్రి మంగళవారం తెలిపారు. తమ పరీక్ష కేంద్రంలో 115 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. మొదటి సంవత్సరం జనరల్ విభాగం నుంచి 64 మంది, వృత్తి విద్యా కోర్సుల నుంచి 15 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగం నుంచి 25 మంది, వృత్తి విద్యా విభాగం నుంచి 11 మంది హాజరవుతారని తెలిపారు. అలాగే బెటర్‌మెంట్ కోసం 16 మంది హాజరవుతారని పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి సీసీ కెమెరాల ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. మద్రివాడ, గోపువానిపాలెం, మేడూరు, ముదిరాజుపాలెం, కృష్ణాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని అల్లూరు శ్రీపార్వతీ సమేత సోమేశ్వరస్వామి ద్వితీయ వార్షిక కల్యాణోత్సవాలు బుధవారం నుంచి శుక్రవారం వరకు జరుగుతాయని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామిని పెండ్లి కుమారుడిగా, అమ్మవారిని పెండ్లికుమార్తెగా అలంకరిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచన, పంచగవ్యం, దీక్షాధారణ, వాస్తుపూజ జరుగుతాయని తెలిపారు. అదేవిధంగా గురువారం ఉదయం రుద్రాభిషేకం, బలిహరణ వంటి కార్యక్రమాలు జరిపి రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉత్సవాల చివరి రోజైన శుక్రవారం పూర్ణాహుతి, త్రిశూలస్నానం జరిపి అఖండ అన్నసమారాధన చేస్తామని తెలిపారు. సమారాధన అనంతరం స్వామివారి ఊరేగింపు, పవళింపుసేవ కార్యక్రమాలు జరుగుతాయని ఈఓ పేర్కొన్నారు.

కలిదిండిలో..

కలిదిండి: కోరుకొల్లు శివారు సోమేశ్వర అగ్రహారంలోని సోమేశ్వరస్వామి దేవస్థానంలో పార్వతీ సమేత సోమేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం నుంచే స్వామిని పెండ్లికుమారుడిని, అమ్మవారిని పెండ్లికుమార్తెను చేయడం, రాత్రి 7 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, పంచగవ్యం, దీక్షాధారణ, అఖండ స్థాపన, అంకురారోపణ, వాస్తుపూజ, అగ్నిప్రతిష్టాపన, పలు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వైఎస్ జగన్ సీఎం కావాలని ప్రత్యేక పూజలు

పామర్రు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, స్థానిక ఎమ్మెల్యేగా కైలే అనిల్ కుమార్ భారీ మెజార్టీతో గెలవాలని ఆకాంక్షిస్తూ విజయవాడ కృష్ణా మిల్క్‌యూనియన్ జిల్లా ట్రస్టు బోర్డు జిల్లా సభ్యుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామికి విశేషంగా పూజాధికాలను నిర్వహించారు. ఆలయంలో స్వామికి మొక్కులు తీర్చుకున్న అనంతరం వచ్చిన భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, ఆరేపల్లి శ్రీహరి, బొమ్మారెడ్డి మాధవరెడ్డి, కాకర్ల శివశంకర్, సజ్జాసుబ్రమణ్యం, గోవర్ధన్‌రెడ్డి, దక్షిణామూర్తి, శేషురెడ్డి, అర్చకులు రామాచార్యులు, ఫణికుమార్ పాల్గొన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల్లో కైకలూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మరో పర్యాయం విజయం సాధించడం ఖాయమని నియోజకవర్గంలో పలువురు నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడ్డారు. స్థానిక ఏలూరు రోడ్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)ను నియోజకవర్గ నాలుగు మండలాల్లో నాయకులు, కార్యకర్తలు మంగళవారం కలిసి ఇటీవల జరిగిన పోలింగ్ సరళిపై చర్చించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేసిన సంక్షేమ పథకాలు, స్థానికంగా ఎమ్మెల్యే డీఎన్నార్ చేసిన అభివృద్ధి పనుల కారణంగా విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గుమ్మడి వెంకటేశ్వరరావు, మసిముక్కు మారుతీప్రసన్న, వెంకటేశ్వరరావు, బొబ్బిలి రత్తయ్యనాయుడు, పాము రవికుమార్, కందుల వెంకటేశ్వరరావు, కొండరాజు, కాలవ నల్లయ్య, ఒడపు రామారావు, షేక్ దాదా, గొరిపర్తి రామకృష్ణ, ఆకుల మురళీకృష్ణ, అగిస్తి ఆదివిష్ణు పాల్గొన్నారు.



కైకలూరు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి డీఎన్నార్‌తో నాయకులు

కౌంటింగ్ కేంద్రాల్లో నిబంధనలు పాటించాలి

గుడివాడ టౌన్: అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు సమయంలో ఆయా పార్టీల కౌంటింగ్ ఏజెంట్లు నిబంధనలు పాటించాలని రిటర్నింగ్ ఆఫీసర్ పి.పద్మావతి అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోలీస్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 144వ సెక్షన్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు గాని బహిరంగ ప్రదేశాలలో గుమికూడి ఉండరాదన్నారు. కౌంటింగ్ సమయంలో పాటించాల్సిన నిబంధనలు పార్టీ నాయకులకు అందజేస్తామన్నారు. వాటిని అనుసరించి కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు వ్యవహరించాలన్నారు. వాటిని పాటించని ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రాల నుంచి పంపివేయడంతో పాటు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నాయకులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి పద్మావతి

పనస తొనలతో పూజలు

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లి ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి 1,008 పనస తొనలతో పూజలు చేశారు. మంగళవారం ప్రసన్నాంజనేయస్వామికి ప్రీతికరమైన రోజు కావటంతో స్వామివారికి గారెల దండ వేసి 1,008 పనస తొనలతో పూజలు చేశారు. పూజా కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



వైభవంగా జగజ్జ్యోతి కార్యక్రమం

ఎలకుర్రు(పామర్రు): పామర్రు మండలం ఎలకుర్రు గ్రామంలోని శ్రీ భ్రమరాంబ సమేత చెన్న మల్లికార్జునస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం జగజ్జ్యోతి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో వేద పండితుల వేదపారాయణ పఠనం కార్యక్రమం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలను నిర్వహించారు. రాత్రి ఏడు గంటలకు ఆలయ ప్రాంగణంలో హోమ గుండంలో జగజ్జ్యోతి కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలోపాల్గొని జగజ్జ్యోతిని దర్శించుకున్నారు. రాత్రి తొమ్మిది గంటలకు భ్రమరాంబ చెన్న మల్లేశ్వర నాట్యమండలి మాచిరాజు రాధాకృష్ణ సమర్పించు సత్య హరిశ్చంద్ర నాటకం నిర్వహించారు. అనంతరం కళాకారులను ఆలయ ధర్మకర్త సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్యధర్మకర్త కాశీనాథుని నాగేశ్వరరావు, భక్తులు ముదిగొండ శాస్త్రి పాల్గొన్నారు.

హెచ్‌ఎంలకు సత్కారం

పమిడిముక్కల: విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉయ్యూరులో జరిగిన కార్యక్రమంలో పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించిన హైస్కూళ్ల హెచ్‌ఎంలను సత్కరించారు. మండలంలోని అగినపర్రు హైస్కూల్ హెచ్‌ఎం ఫణికుమార్‌ను, ఐనపూరు హైస్కూల్ హెచ్‌ఎం స్వామిని డీఈఓ తాహెరా సుల్తానా, డీవైఈఓ పద్మారాణి, ఏపీసీ రాములు నాయక్‌లు సత్కరించారు.



అగినపర్రు హైస్కూల్ హెచ్‌ఎం ఫణికుమార్‌ను సత్కరిస్తున్న డీఈఓ



ఐనపూరు హైస్కూల్ హెచ్‌ఎం స్వామిని సత్కరిస్తున్న డీఈఓ

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

పెదపారుపూడి: మండలంలోని 19 గ్రామాల్లో ఉపాధి హామీ పనులు మంగళవారం ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలోని పెదపారుపూడి, వానపాముల, వెంట్రప్రగడ, దోసపాడు, యలమర్రు, పాములపాడు, వింజరంపాడు తదితర గ్రామాల్లో పంట బోదెల్లో తవ్వకం పనులు జరుగుతున్నట్లు మొత్తం సుమారు మూడు వేల మంది కూలీలు పనిలో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.



చావలిపాడులో పంట కాలువ మరమ్మతు పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

ఉపాధి హామీతో బహుళ ప్రయోజనాలు

మండవల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం పనులతో రైతులకు బహుళ ప్రయోజనాలు సమకూరుతున్నాయని ఎంపీడీఓ ఎస్.నవీన్ అన్నారు. మండలంలోని చావలిపాడులో రూ.1లక్ష 20 వేల ఉపాధి హామీ నిధుల వ్యయంతో 102 మంది కూలీలతో పంట కాలువ అభివృద్ధి పనులను మంగళవారం నిర్వహించారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం జరిగిన 148 పనుల్లో 5,245 మంది కూలీలు పాల్గొన్నట్లు ఈసీ కిరణ్‌కుమార్ తెలిపారు. పంటకాలువల తవ్వకం పనులు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సచివాలయం పరిశీలన

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడలోని సచివాలయాన్ని ఎంపీడీఓ టీ సీతామహాలక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఉపాధి హామీ పనులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో సమస్యలు ఉంటే గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సగ్గుర్తి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దు

పమిడిముక్కల: సోషల్ మీడియాలో వ్యక్తులను, పార్టీలను రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దని ఎస్‌ఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సోషల్ మీడియా గ్రూపు అడ్మిన్‌లకు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పేట్టే పోస్టులను ట్రోల్ చేయకూడదన్నారు. వ్యక్తిగత దాడులు, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకూడదన్నారు. ఈ విషయంలో గ్రూప్ అడ్మిన్‌లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమాజంలో శాంతి, సామరస్యం కాపాడేందుకు తమ వంతు సహకారం అందించాలని కోరారు.



సోషల్ మీడియా గ్రూపు అడ్మిన్‌లతో మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్

విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

మండవల్లి: మండలంలోని లింగాలలో కొలువై ఉన్న శ్రీ గంగా విశాలాక్షి సమేత శ్రీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి దివ్యలీలా కల్యాణ మహోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారిని, అమ్మవారిని పెండ్లి కుమారుడు, పెండ్లికుమార్తెను చేశారు. రాత్రి అంకురార్పణ, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్టాపన, వాస్తుపూజలు నిర్వహించారు. మున్నలూరి దుర్గాప్రసాద్ దంపతులతో ఆలయ అర్చకులు సుదర్శన శరత్‌బాబు పూజలు నిర్వహించారు. మహోత్సవంలో యాజ్ఞికులుగా శ్రీమాన్ కాశీవరప్రసాద్ వ్యవహరించారు.



లింగాల మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజలు

శ్రీవాసవీ మాతకు మహాపుష్పాభిషేకం

పెడన: పట్టణంలో శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి మంగళవారం మహాపుష్పాభిషేకాన్ని నిర్వహించారు. మూడు రోజులుగా శ్రీవాసవీ మాత జయంతి మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి ముగించగా మంగళవారం సంప్రదాయకంగా అమ్మవారికి మహాపుష్పాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం వాసవీ క్షేత్రంలో ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్న, సభ్యుల పర్యవేక్షణలో పట్టణ శ్రీవాసవీ మహిళా మండలి వారు గులాబీలు, చామంతులు, మల్లెలు, కాగడా మల్లెలు, బ్లూ, పసుపు చామంతులు తదితర 108 కిలోల పూలతో శ్రీవాసవీ మాతకు పుష్పాభిషేకం (పుష్పయాగం) శ్రీ వాసవీ మహిళా మండలి కార్యవర్గ సభ్యులు నిర్వహించారు.